KABA 103 B 147

పండరినాథ విఠల శతకము

కపిలవాయి లింగమూర్తి

నాగరకందనూలు

పండరినాథ విఠల శతకము

❖

కపిలవాయి లింగమూర్తి
తెలుగు పండితులు
జాతీయోన్నత పాఠశాల
నాగరకర్నూలు

పరీధావి ఆశ్వయుజం
అక్టోబరు 1972
మొదటి ముద్రణ
వేయి ప్రతులు

❖

ముఖచిత్రం
శ్రీ పాండురంగస్వామి
రుక్మాబాయి
(నాగరకందనూలు)

❖

పండరినాథ విఠలాలయము కమిటీకి
5 రూ॥ల విరాళము నొసగి
ఈ గ్రంథమును పొందవచ్చును.

ముద్రణ :
సుదర్శన్ ప్రింటర్స్, హై.

గ్రంథకర్త

కె. లింగమూర్తి

ACHUT...
HYDERABAD - 500 044.
Cell: 87907 27772
IIa

|||

తొలిపలుకు

ఆంధ్రసారస్వతమునందు శతక ప్రక్రియ బయలుదేరిన నాటి నుండియు ఆజాతికి చెందిన రచనలు మానవ సమాజమునకు చేసిన సేవ అపారము. నీతి, భక్తి, లోకవృత్తము, హాస్యము, దుర్గుణ విమర్శనము మొదలయిన అంశములను గురించి శతక వాఙ్మయము చేసినంత ప్రచారము మరి యే యితర వాఙ్మయ ప్రక్రియ కూడా చేయఁజాలక పోయిన దనుట నిర్వివాదాంశము. ఆబాల వృద్ధముగా నందరి జిహ్వాగ్రములందును శతక వాఙ్మయమునకు చెందిన కొన్ని పద్యములయినను నిలిచియుండుట మన మెఱుగుదుము. సప్తసంతానములలో ఒకటియైన 'కృతి' శతక రూపమున వెలయుటలో మంచి ప్రయోజనము కలదు. అదియు మరియొక సప్తసంతానాంతర్గతమైన "గుడి"తో విడరాని సంబంధము కలదై యుండుట మిక్కిలి విశేషము. బంగారమునకు పరిమళమబ్బినట్లు. నాగర కందనూలులోనే కాక మహబూబ్‌నగరం జిల్లా అంతటను సుప్రసిద్ధ న్యాయవాదిగాను, తెలంగాణమున జాతీయోద్యమ నాయకుడుగాను పేరుగాంచిన శ్రీ చిక్కేపల్లి రామచంద్రరావుగారు నిరంతర గీతాపారాయణ దైవ ధ్యాన పరులై యుండుటయే కాక, పండరీపురమునకు వెళ్ళి, పాండు రంగని సేవించివచ్చి తచ్చిహ్నముగా నాగరికందనూలులో తమగృహమునకు సమీపమున నున్న శ్రీ హనుమదాలయ ప్రాకారమునందు శ్రీ పాండురంగ విఠలేశ్వరుని గుడి కట్టించి అందు శ్రీ విఠలేశ్వరుని ప్రతిష్ఠ గావించిరి. తేది 24-2-1972 పరీధావి సంవత్సర చైత్ర శు॥ దశమి శుక్రవారము నాడు జరిగిన ఆ విఠలేశ్వరుని ప్రతిష్ఠా మహోత్సవమునకు నేనుకూడా వెళ్ళ పాల్గొను భాగ్యమును శ్రీ రామచంద్రరావు గారే కల్పించి నారు. అధిక సంఖ్యలో ఆలయమునకు విచ్చేసిన పురప్రముఖుల యొక్కయు, విద్వాంసుల యొక్కయు సమక్షమున శ్రీ రామచంద్రరావు

గారు స్వామివారిని ప్రతిష్ఠ గావించినప్పుడు భక్తుల జయజయధ్వానములు మిన్నుముట్టినవి.

సప్తసంతానములలో నొకటియైన దేవాలయమును దేవతా ప్రతిష్ఠను అట్లు చేయుటయేగాక దానికి సంబంధించిన కావ్యరత్నమును గూడ స్వల్పకాలములోనే "పండరినాథ విఠలశతకము" అను పేరుతో వ్రాయించుట మిక్కిలి శ్లాఘాపాత్రము. ఇట్లు తాను ప్రతిష్ఠించిన దైవముపై శతకమును వ్రాయించిన వారు మిక్కిలి అరుదు.

శతక రచయితయైన శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు సంస్కృతాంధ్ర సాహిత్యముల మర్మము నెఱిగిన విజ్ఞులు. తెనుగుకవితా రచనమునందు మంచి యనుభవమును సంపాదించినవారు. సిద్ధహస్తులైన లింగమూర్తిగారు ఈ శతకమును ఒక నూతన మార్గమున రచించిరి. నూటయెనిమిది పద్యములు గల యీ శతకమునందు, ఆరుప్రణుతులు, ఒక షష్ఠ్యంతము, పది విభక్త్యంతములు, ముప్పది కథలు, పది యవతార కథలు, ఏబది ప్రపంచ రీతులుగా విభజించి శతక రచనమునందొక క్రొత్త పోకడను జూపిరి. ఇది మిక్కిలి ప్రశంసాపాత్రమై యున్నది. ఇక వారు కూర్చిన "నాగర కందనూలు పురనాయక పండరినాథ విఠలా" అను శతక మకుటము సరళముగా నుండి ధారణకు యోగ్యముగా నున్నది. శతకమును నేర్చుకొనువారికిని, భజన సమాజములందు ఈ పద్యములు పాడువారికిని మిక్కిలి యనుకూలముగా నున్నది.

ఇక శ్రీ లింగమూర్తిగారి రచనా వైదుష్యమును శతకము నందలి పద్యములన్నియు దెలుపుచున్నవి. ఈ శతకమును "సరళ ప్రాసను నల్లితి"నన్నారు. ఇచ్చట "గ" కారము సరళసంజ్ఞ గలదగుటచే చమత్కృతి యున్నది. ఇట్టి చమత్కారముల నచ్చటచ్చట జూపియున్నారు. దేశ్యపదములను, తద్భవములను, తెలంగాణా జాతీయములను సముచిత

ముగా వాడి పద్యముల నన్నిటిని చక్కని శైలిని నడిపిరి. "గాధాత్రింశి కలో" భక్తులకును, ముఖ్యముగా పాండురంగ భక్తులకును సంబంధించిన కథాంశములను నేర్పుతో నిమిడించిరి. "లోకపంచాశిక"లో తాత్త్విక విషయములతోపాటు భక్తియు, సమకాలిక సమస్యలును తొంగి చూచు చున్నవి. ఇట్లు సమర్థవంతముగా రచింపబడిన ఈ శతకమును శ్రీరామ చంద్రరావు గారికిని శ్రీ విఠలేశ్వరునకును అంకితము చేయుట విద్వజ్జన మనోరంజకమై యున్నది.

శ్రీ చిక్కపల్లి రామచంద్రరావుగారు తమ ధర్మపత్ని శ్రీమతి వేంకట నరసమాంబ సహితముగా నెన్నిటినో పుణ్య కార్యములను, తీర్థయాత్రలను, ధర్మకార్యములను గావించిరి. నైజాము ప్రభుత్వకాలమున సాగిన జాతీయోద్యమములలో ఆంధ్ర మహాసభకు ప్రధాన కార్యదర్శిగా నుండిరి. ఖద్దరు ప్రచారము, హరిజన సేవ మొదలయిన కార్యకలాపములలో శ్రద్ధాసక్తులతో పాల్గొనిరి. తెలంగాణా నాయకులలో సుప్రసిద్ధులైన కీ॥శే॥ ఎన్.కే. రావుగారు వీరి తమ్ములు. వారి నంతవారినిగా తీర్చిదిద్దినది వీరే. ఇప్పటికిని నాగర కందనూలులోను, తత్పరిసరము లందును ఏ విధమైన ప్రజోద్యమములు జరిగినను, ఏ వైవ కార్యక్రమములు జరిగినను, ఏసాహిత్య సభలు జరిగినను శ్రీ రామచంద్రరావు గారి సహకారము లేక జరుగవు. అట్టి వీరు శ్రీ విఠలేశ్వరుని ప్రతిష్ఠించి, ఆస్వామిపై శతకమును వ్రాయించి కృతి నందుటచే ధన్యులైరి. మృదు మధుర చమత్కార పదభూయిష్ఠమైన శతకమును వ్రాసి దైవముతో పాటు శ్రీ రామచంద్రరావు గారికిని అంకితము చేయుటచేత శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు కృతకృత్యులైరి. ఇట్టి పుణ్యకార్యమున కాస్పదమైన నాగర కర్నూలు ధన్యతమమైనది.

సీ॥ శ్రీ దుకూలాంచలశ్రీల నందము లొల్క
జాళవా వలువ పై జారుచుండ,
అమ్లాన వనమాలికాభిరామమౌ
కట్టుపుట్టము నేలఁ గ్రాలుచుండ,
శంఖంబు, చక్రంబు, శార్ఙంబు, గదయును
బాహుచతుష్టయ ప్రభల వెలుగ,
తిరుమణి శ్రీచూర్ణదీర్ఘోర్ధ్వ పుండ్రంపు
మొగమున చిఱునవ్వు ముంగలింప

గీ॥ సదయహృదయుఁడు విఠల స్వామి మీకు
శాశ్వతైశ్వర్య సుఖముల సంతరించి
పుత్రపౌత్ర పరంపరన్ బ్రోచుగాత
సకల జనగేయ! శ్రీరామచంద్రరాయ!

సీ॥ మెత్తని తరగల పొత్తికల్ పరచుచు
మున్నీరు పెంచిన ముద్దుబిడ్డ
తులసి పేరుల యంద మొలుకు వక్షంబున
నచ్యుతుండునిచిన యందకత్తె
కడుపు పంటగఁ ముద్దు కమ్మ విల్తుని గని
కీర్తించిన మేటి గేస్తురాలు
కొలుచు భక్తుల యిండ్ల మెలగి మువ్పొద్దుల
తులలేని సుకమిడు దొడ్డతల్లి

గీ॥ స్వామి విఠలు సహధర్మ చారిణియయి
మెలగు రుక్మమ్మ సత్కృపాకలిత యగుచు
నేలుకొను మిమ్ము సంపదలిచ్చి యెపుడు
సాధుజనగేయ! శ్రీరామచంద్రరాయ!

కం॥ కృతికర్త లింగమూర్తికి
శతకస్వీకర్త రామచంద్రార్యునకున్
పతి పాండురంగ విఠలు
డతులితసౌఖ్యంబు లిచ్చునాతారముగన్

ఇట్లు
విద్వజ్జన విధేయుడు,
కేశవపంతుల నరసింహశాస్త్రి
విద్వాన్, శిరోమణి.
ఆకాశవాణీ కార్యక్రమ నిర్వహణాధికారి.

తేది. 17–9–1972
బర్కత్‌పుర,
హైదరాబాదు.

శ్రీ

అభిప్రాయము

డా. దివాకర్ల వేంకటావధాని, ఎం. ఏ. (ఆనర్సు) పి. హెచ్. డి.
ఆంధ్రశాఖాధ్యక్షుడు,
ఉస్మానియా విశ్వవిద్యాలయము.

మిత్రులు శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు రచించిన పండరినాథ విఠల శతకము చదివి యానందించితిని "నాగరకందనూలుపురనాయక పండరినాథ విఠలా" అనునది యీ శతకమునందలి మకుటము. పండరి నాథుడే శ్రీ చిక్కేపల్లి రామచంద్రరావుగారి ప్రార్థనపై నాగరకర్నూలున వెలసి వారి సేవలందుచున్నాడు. భగవానుడు భక్తపరాధీనుడు కదా! ఈ శతకము నుతిషష్ఠము - షష్ఠ్యంతము - సుబంతదశకము - గాథాత్రిశతి - లోకపంచాశిక అను భాగములుగా విభజింపబడినది. ప్రతి పద్యము నందును భక్తిభావము నిండారి యున్నది. కొన్ని పద్యములలో భగవద్గాథలును, కొన్నింట సంఘ పరిస్థితులును వివరింపబడినవి. శతక మాద్యంతము గకారప్రాసముతో నిర్వహింపబడుట ప్రశంసింపదగిన విషయము. ఇందలి పద్యములు ధారాశుద్ధి శోభితములును, సులభ సుందరములును, భక్తిభావ నిర్భరములునై సహృదయ హృదయానంద సంధాయకములుగా నున్నవి. శ్రీ లింగమూర్తి గారింకను రసభావ గంభీరములైన కృతులు వెలయించి ఆంధ్ర భాషాయోష కపూర్వాలంకృతులు సంతరింతురనియు, పరమేశ్వరుడైన పండరినాథుడు భక్తి తత్పరులైన శ్రీ రామచంద్రరావుగారిని, వారి కుటుంబమును, నాగరకందనూలు పురవాసులను, ప్రపంచమందలి సకల మానవులను రక్షించు ననియు నాశించుచు ముగించుచున్నాను.

హైదరాబాదు, 15-9-72

కృతిభర్త పరిచయం

నేను కొల్లాపురంతాయారాలో చేరిన చిక్కేపల్లి గ్రామంలో కరణం నాగులపల్లి వంశీకులైన పట్టాభిరామారావుగారి ద్వితీయ సతీమణి శ్రీమతి రావమ్మ తొమ్మిదవ గర్భములో విళంబినామ సంవత్సర పుష్య బ॥3 లు (1899) జన్మించినాను. నామకరణంరోజు నా తండ్రిగారి ఆచార్యులు, తిరుపతి నివాసస్తులు మా యింటికి వేంచేసి వేంకటేశ్వర నామకరణం చేయించినారు. కాని నా తల్లిగారి పిలుపుచే పేరుమారినది. తదుపరి పుట్టు గ్రామమే వంశనామముగా పరిగణించబడినది. ఆరు మాసముల వయస్సున హైద్రాబాదు పెద్దమహారాజు గంజిలో మేనమామగారి ఇల్లుకూలడము. అందులోనుంచి నేను సజీవముగా వెళ్ళడమువల్ల సుమారు 14 సంవత్సరముల పిదప తిరుమల తిరుపతిలో మ్రొక్కుచెల్లించుకొనడం జరిగింది.

సుమారు రెండు సంవత్సరములు కొల్లాపురం, ఒక సంవత్సరము గద్వాల, మూడు సంవత్సరములు నాగర్‌కర్నూలులో 16 సం॥ల వయస్సున ప్రాథమికవిద్య తెలుగు ఉర్దూ భాషలలో పూర్తిచేసుకొనినాను. తదుపరి వకీలుపరీక్షకు అవసరముండే మిడిల్‌క్లాసు చదువు మహబూబునగర్‌లో సుమారు 8 మాసములలో పూర్తిచేసి ఉత్తీర్ణుడనైనాను. ఆర్థికముగా చాల ఇబ్బంది యుండటముచే పై పరీక్ష ఇవ్వగానే జిల్లా ప్రభుత్వంచే వ్రాతపనికై నియమించబడి, 6 మాసముల తదుపరి పాతపాలమూరు బ్రాంచ్‌స్కూలు టీచర్‌గా ఒక సంవత్సరముండి, వకాలత్ పనికి సహాయపడగలదని జిల్లా సివిల్‌కోర్టులో బెంచ్‌క్లర్క్‌గా రెండు సంవత్సరములు పనిచేసి, హైద్రాబాదులో స్వర్గీయ శ్రీకొండా వెంకటరెడ్డిగారి లాకమెటీలో రెండు మాసములు, శ్రీ ఇబ్రాహిం అలీగారి లాకమేటీలో ఆరుమాసములు చదివి వకాలత్ పరీక్షలో ఉత్తీర్ణుడనైనాను. ఈ మధ్యకాలములోనే

ఇన్‌ఫ్లూయంజా రోగానికి గురియై దసరాపండుగరోజున సంగారెడ్డి పట్టణములో నిరాశతో యింటిబయిట వుంచబడికూడ యమధర్మరాజు గురి నుండి తప్పించుకున్నాను.

జూన్ 1919 నుంచి వకాలత్ స్వంతముగా మహబూబ్‌నగర్‌లో ఆరంభించి ఏప్రిల్ 1922న నాగర్‌కర్నూల్ మున్సిబ్‌కోర్టు యేర్పాటు కావడముతో నేను మహబూబ్‌నగర్ వదలడము, నాగర్‌కర్నూలు నివాసస్థానము కావడము జరిగినది. ఇక్కడ సుమారు 15 సం॥లు ప్రాక్టీస్ బాగుగా జరిగినది.

1936 లో స్వర్గీయ ఆంధ్రపితామహ శ్రీ మాడపాటి హన్మంతరావుగారు మరియు నా మిత్రులు శ్రీ మం॥ రాంచందర్‌రావుగారి ప్రోత్సాహమువల్ల రాజకీయములో ప్రవేశించితిని. ఆంధ్రమహాసభ జిల్లాశాఖ కార్యాలయము నాగర్‌కర్నూల్లో ఏర్పాటు అయి నేను కార్యదర్శిగా నియమింపబడితిని. ఈ సంస్థ కార్యక్రమాలు, సభలు అప్పటి హైద్రాబాదు నవాబ్ ప్రభుత్వము మరియు అధికారులకు సరిపడక పోవడమువల్ల 1939లో క్రొత్తగా ఏర్పడిన హైద్రాబాదు స్టేట్ కాంగ్రెస్ సంఘము చట్టవిరుద్ధమైనదని ప్రభుత్వము ప్రకటించినది. నేను మా ఇంటి సమీపంలో వున్న హనుమదాలయములో హనుమజ్జయంతిరోజు కాంగ్రెస్‌సంస్థకు విరాళాలు ఇవ్వవలసినదిగా ప్రజలను కోరినానను నెపముతో అరెస్టుచేసి కృష్ణజన్మస్థానానికి పంపడము 5 మాసాలు జైలుశిక్ష విధించడము జరిగినది. తదుపరి ప్రభుత్వం ఆర్డరుతో విడుదలకావడమైనది. కాని ప్రభుత్వాధికారులు ప్రత్యేకంగా నాకు నా ఆస్థికి చేసిన కష్టనష్టాలఫలితము ఇప్పటికి అనుభవించడము జరుగుచునే యున్నది.

15–8–1947 న భారతదేశమంతటా ప్రజలు స్వాతంత్ర్యోత్సవాలు జరుపుకొన్నను హైద్రాబాదు స్టేట్ ప్రజలకు 13 మాసములవరకు స్వాతం

త్ర్యము సంక్రమించలేదు. ఈ కాలములో రాజకీయ కార్యకర్తలు, ఇతర ప్రజానీకము ప్రభుత్వముయొక్కయు రజాకార్లయొక్కయు దౌర్జన్యాలకు గురియై వారి జీవితమే దుర్లభమై యుండెను. తుదకు 11 సెప్టెంబరు 1948 న పోలీసు యాక్షన్ జరగడంతో స్వతంత్రము కావడము జరిగినది. పై సందర్భంలో 31 వ మార్చి 1948 న అరెస్టుచేసి జైల్లో డిటెన్షన్‌గా వుంచినారు. 15 రోజులలోనే అనారోగ్యమువల్ల ఉస్మానియా ఆస్పత్రికి పంపడము, నెల తదుపరి జీవించననే భావంలో వదలడము జరిగినది. కాని అప్పటి పరిస్థితుల దృష్ట్యా సెప్టెంబరు తుదివరకు అజ్ఞాత వాసము గడిపి ఆరు మాసములు పూర్తికాగానే యిల్లు చేరుకోవడం జరిగినది.

25 సంవత్సరాలకు పైగా ఆంధ్రమహాసభలో పై విధముగానో, మరియు కాంగ్రెస్ తాలుకాసంఘ అధ్యక్షునిగానో వున్నప్పటికి నాకు మొదటి జనరల్ ఎన్నికలో పోటిచేయుటకు కాంగ్రెస్ టికట్ లభించలేదు. స్వాతంత్ర్యము తదుపరి కోర్టుభాష ఇంగ్లీష్ కావడంవల్ల నా అడ్వకేటు ప్రాక్టీసుకు స్వస్తిచెప్పవలసి వచ్చినది.

ఇప్పటికి రాజకీయబాధితునిగా నాకు ప్రభుత్వంనుండి ఏలాంటి ప్రతిఫలము లభించలేదు. వ్యవసాయములో అధికనష్టాలు వచ్చినను భూములు పరస్వాధీనము కాగూడదని దాన్ని కొనసాగించక తప్పలేదు. భూముల విక్రయముతో జీవితము జరపడమే చాలా కష్టముగా వున్న పరిస్థితిలో భూములు విక్రయించకూడదనే ఆర్డినెన్సు, తదుపరిచట్టము రావడమువల్ల మరింత కష్టమైనదని వేరుగా చెప్పనవసరములేదు. ఇందులో క్రొత్తభూసంస్కరణల చట్టం ప్రకారము వున్న భూమినికూడ ప్రభుత్వము తీసుకొనడము మరీ విశేషము.

ముకుందమాలలో కులశేఖరాళ్వారులు సాయించిన శ్లోకము:_

నాస్థా ధర్మేనవసు నిచయేనైవ కామోపభోగే
యద్యద్ భవ్యం భవతు భగవన్ పూర్వకర్మాను రూపమ్
ఏతత్ ప్రార్థ్యం మమ బహుమతమ్ జన్మజన్మాంతరేపి
త్వత్పాదాంభోరుహయుగగతా నిశ్చలా భక్తిరస్తు

ఈ శ్లోకానుసారము భగవంతుని పాదాలపైన నిశ్చలభక్తివుంచి స్మరణచేయుట తప్పదు. మా యింటిసమీపంలోవున్న హనుమదాలయములో విష్ణువు లేకపోవడము ఒక లోపమని చాలాకాలమునుండి తలంచియుంటిని. అక్కడ ఆంజనేయులకు ప్రక్కనవున్న గదిలో కన్యకాపరమేశ్వరి విగ్రహముండెను. సుమారు రెండు సంవత్సరముల క్రితము ఆ విగ్రహాన్ని వేరే ఆలయానికి మార్చినందున అప్పుడే ఆ గదిలో శ్రీ పాండురంగ స్వామిని ప్రతిష్ఠ చేయవలయునని సంకల్పించితిని. అమ్మవారితోపాటు రెండువిగ్రహములూ రాగానే ఈ పరీధావి సం॥ర చైత్రశుద్ధ 10 లకు ప్రతిష్ట కాగలదని పత్రికలలో తెలుపబడినది. అంతకు కొన్ని దినముల క్రితము ఆ గదిలో పుట్టపర్తి సాయిబాబాగారి పటాలు మరియు షిర్డిసాయి బాబాగారి విగ్రహముంచి భజనలు జరుపడము నాకు తెలిసి ఉగాదిరోజు పంచాంగశ్రవణ సమయమున అదే ఆలయములో చర్చకు తీసుకురాగా ఒకరు నన్ను వేరే ఆలయము కట్టించి ప్రతిష్ఠ చేయమనిరి. అక్కడ ఉన్న వారందరు మౌనము ధరించిరి. మరుదినమే ఆ ఆవరణములోని వేరే స్థలములో గర్భగుడి ఆరంభించి ఒక వారమువరకే సిద్ధముచేసి నిర్ణయించిన దినమే ప్రతిష్ఠ జరిపితిని. దానిప్రక్కన మహిళాగీతా మందిరము, ముందు భజనమందిరము నిర్మాణము జరుపటముతో మొదట వేసుకొన్న 5 వందల వ్యయం అంచనాకు బదులు మూడువేలకుపైగా వ్యయము జరిగినది. ఇదికూడ కరువుకు అధికమాసములాగావుంది.

శ్రీ పాండురంగస్వామి దేవస్థానమునకు ఏలాటి ఆదాయము లేనందున శ్రీ కపిలవాయి లింగమూర్తిగారు తమ పాండిత్యము ఆదాయం కల్పించుటకుగాను పాండురంగ శతకం రచించినారు. వెంటనే వారి వేతనము నెలసరి పందరూపాయలు పెరిగినది. శ్రీ సంజీవయ్యగారు భక్తి శ్రద్ధలతో దినము పూజలు జరుపడమేగాక పై ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా నిర్ణీతవేతనము సగము రామే తగ్గించుకొన్నారు. ఈ విధంగా భక్తులలో ఉత్సాహము, త్యాగము కల్గిన ఏలోటు లేకుండా దేవస్థాన కార్యక్రమాలు జరుగగలవనే నమ్మకముండడము సహజమే. పై ఇద్దరు మహనీయులకు, 17_9_72 నాడు హైదరాబాదులోని గాంధీభవనంలో నన్ను సన్మానించిన స్వాతంత్ర్యయోధుల సన్మానసంఘంవారికి, ఈ శతకమునకు తొలిపలుకు సమకూర్చిన శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారికి, తమ అమూల్యమైన అభిప్రాయము నొసగిన డా॥ దివాకర్ల వేంకటావధానిగారికి, ఈ గ్రంథం ఈ రూపంలో వెలువడటానికి ఎంతగానో తోడ్పడిన పాలమూరుజిల్లా సాహిత్య సాంస్కృతిక సమితి 'జ్యోతిర్మయి' అధ్యక్షులు శ్రీ ఎస్. వి. రామారావుగారికి కృతజ్ఞతాభివందనములుసమర్పించుతూ ముగించుచున్నాను.

భవదీయుడు,

1_10_1972, స్వామివారి భృత్యవర్గములో చేరిన,

నాగర్‌కర్నూలు విద్యాలయములు, జాతీయోన్నత పాఠశాల,

గాంధీ స్మారక హరిజన వసతిగృహముల అధ్యక్షుడు

XIV

సన్మానపత్రము

శ్రీ చిక్కేపల్లి రామచందర్‌రావు

బ్రిటిష్ సామ్రాజ్యవాదులనుండీ, నిజాం నిరంకుశ పరిపాలననుండి హైదరాబాదు రాష్ట్ర ప్రజలకు విముక్తి సాధించిన యోధులలో ఒకరైన మీ పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచియుండగలదు.

ఇదే మీకు మా భక్త్యంజలి.

గాంధీభవన్,
హైద్రాబాదు,
17-9-1972

(అధ్యక్షులు)
స్వాతంత్ర్యయోధుల సన్మానసంఘము.

కృతిభర్త



శ్రీ చిక్కేపల్లి రామచంద్రరావు
శ్రీమతి వేంకట నరసమాంబ

పాండురంగస్వామి
ఆలయ ప్రతిష్ఠాపకులు
మహిళా గీతామందిరము
భజనమందిరము నిర్మాతలు

XVII

స్వకీయము

పాలమూరు జిలాను, గ్రాలునచ్చమపేట
తాలుకన్ జినుకుంట మూలమగుచు
విశ్వజ్ఞకులమొందు వెలసె మైత్రేయస
గోత్ర కాత్యాయన సూత్ర కపిల
వాయి నా బరగి రామయ యందు వర్ధిలె
సాహిత్యకృషిసల్పి సంతతంబు
అతని కుమారుండు నగు సింగవట్నంబు
సంగీత సాహిత్య శాస్త్రవేత్త

అంతమాంబా సతీమణి యందు నలువు
రాత్మజుల గాంచె నందు మూడవ సుతుడుగ
నెగడు వేంకటాచలము మాణిక్యమాంబ
తనయుడను లింగమూర్తి నా దనరువాడ.

విమలయశుడగు మాతులుం దమరబాద
యందు చేపూరు పెద్ద లచ్చయ్యగారు
వారి సాహిత్యశిక్షను వర్ధిలుటను
పండితుడనంచు కవినంచు పలుకబడితి.

రహిని వెల్దండ వేంకటరావు మిత్రు
డిచ్చు ప్రోత్సాహబలమును మెచ్చుకోలు
శాణితత్వము నూతగా సల్పినాను
దీనినొక్క ప్రయోగముగాను నేను

షట్తిలైకాదశిని కృతిసలుపుమనగ
జేసితిని శయనైకాదశీవరకును
కామదైకాదశిని నచ్చుకై నొసంగ
గనియె నావిష్కృతమున జైకాదశివిది.

కృతిభర్త

మహబూబునగరున రిహిని నాగరకంద
సూలువాసి నియోగి, మేలుబంతి,
రామానుజమతానుగామి కౌండిన్యస
గోత్రు డాపస్తంభసూత్రవరుడు,
షిటీయజుశ్శాఖి చిక్కేపల్లిగృహ వేధి
పట్టాభిరామయ్య వరసుతుండు
రామచందరరావు నామంబుగలవాడు
తా న్యాయవాదియు, ధార్మికుండు

తనకు వేంకటనర్సమ ధర్మపత్ని
ఘనుడు కడుదొడ్డసంసారి, కర్మపరుడు
ఉత్తమకుటుంబి మరియు బహూదకుండు
జాతకము మించి బ్రతికిన జాతకుండు.

పండరీపురిసేవించి, పరమభక్తి
స్వామి తమయూర పావనిసదనమందు
సుప్రతిష్ఠించి శతపత్ర సుమసరముల
నెమ్మి నర్చింపదలచి నన్ దెమ్మటనిన-

ప్రణుతులా రొకిషష్టి ంభిక్షులు పది
కథలు ముప్పది యవతారకథలు పది ప్ర
పంచరీతులు నేబది ఫలశృతియును
గలిపి తిరుపతి లెక్క యాకలువపూలు

బందుతోమ్మిది యేడును రెండుగలుగు
క్రైస్తవాబ్ది పరీధావికాలమందు
సరళప్రాసను నల్లితీసరులు రామ
చంద్రరావిచ్చు పండరీశ్వరునికోజకు ।

ధర్మకార్యాభిరతి సదా దప్పకుండ
సంతతోదారగుణములు సడలకుండ
నిత్యము పరోపకారియై నెగడుచుండ
మత్కృతిపతిని రంగడు మనుచుగాత.

1

... సు తి ష ష్ఠ ము ...

1. శ్రీగలవాడవై యిటుక చిన్మయపీఠముపై వసించి, సు
శ్రీ గనుపింప పాదః శేషమునన్ నత భక్తలోక క
ల్పాగమరాజమై వెలసి హాఃనిలోకము బ్రోచు మాధవా
నాగరకందనూలుపుర నాయక పండరినాథ విఠ్ఠలా

2. ఆగమమస్తకాగ్ర విపినాళి నలౌకిక వేళకాళకా
భోగి శిరోగ్ర భూరిమణి ధాముల లౌకిక వేళ దివ్యలీ
లాగతి తాండవించిన పరాత్పర త్వత్పదమాశ్రయించెదన్ ॥నాగ॥

3. రాగుల కాది కావ్యము విరాగులకైదవ వేదమిచ్చి, రా
యాగమ స్రష్టలన్ ఋషుల నాదిమ ద్రష్టల, భవ్యకావ్య లీ
లాగురులన్ ప్రచేతస పరాశరసూనులనే భజించెదన్ ॥నాగ॥

4. వాగనుశాసనుండు కవి బ్రహ్మయు నా పరమేశ్వరుండు, నా
పైగన సోమనార్యుడును భాస్కరుడున్ మునుగా బుధుల్ గురుల్
తాగని జెప్పలేదు తవ తత్వము నేనెరుగన్ వలంతినే ॥నాగ॥

5. శ్రీగనలేదు సిద్ధులసలేగనలేము, గురుండులేడు. తా
నేగతి నాంధ్ర భాగవత మెల్లరచించెనొ పోతరాజు. ఆ
భాగవతాగ్రగణ్యు కవి పండితు గొల్తు కవిత్వసిద్ధికై ॥నాగ॥

6. తాగనపుట్టుగ్రుడ్డి యవతారమునైనను లోకచక్షువై
దాగిన నీదులీల విశదమ్ముగ కమ్మగబాడి ద్రష్టయై
నీగుణభక్తిశాఖిపయి నెమ్మిగ బొల్చిన సూరునెన్నెదన్ ॥నాగ॥

... ష ష్ఠ్యంతము ...

7. త్యాగ విధాన బోధికిని, ధర్మ సముద్ధరణాధికారికిన్
ఆగమ మార్గచారికిని, ఆర్యనికాయనుత ప్రవృత్తికిన్
శ్రీ గుణరామచంద్ర నయశీలికి. నీకు ప్రశస్తి బల్కెదన్ ॥నాగ॥

... సు బం త ద శ క ము ...

8. శ్రీ గుణనామ దివ్యముని సేవితనామ జగత్రపూత, ది
వ్యాగమనామ, దుఃఖపరిహారకనామ, సమస్త పాప దూ
రాగతనామ, పంకజభవాభవందిత భద్రనామశ్రీ ॥నాగ॥

9. యాగవిహారు, భీతిపరిహారు, సమస్త విచారధీరు, నా
నా గుణతారహారు, నవనారదనీలశరీరు, పూర్ణతే
జోగణనీయసారు, వనజోదరు, నిన్భజియింతుగావవే ॥నాగ॥

10. మాగినభక్తిచే విమల మార్గముచే, నరుదైన రీతిచే
త్యాగముచే మనోనియమ యాగముచే దనరన్ జపంబుచే
యోగముచే, పలుశ్రమల నొందగజాల నుతింతుగావవే ॥నాగ॥

11. పాగకు శాలువా కొరకు పంట పొలమ్ములకున్ ప్రశస్తికిన్
జాగకు జాళువాకొరకు చందురుసాలకు జున్నుపాలకున్
పేగులకున్ గజంబులకు, వేడను, వీడను, నీడనీయవే ॥నాగ॥

12. వీగెడుకంతుపూవలన వీడినహ్రీవలనన్ ప్రకోపియై
రాగిలుకాంతభ్రూవలన రాగలభీవలనన్, జికాకుచే
కాగల కాలమేవలను గాగలదో నను గావవేప్రభూ ॥నాగ॥

13. నీగురుతుల్ ఋతుల్ గనుచు, నీ కొలువున్ నిరంతంబొనర్చుచున్
నీ గుణముల్ దలంచుచును, నీ కథలన్ విని నీకుదాసుడై
నీ గణమందుజేరుతమి నెక్కొనిజిక్కితి గాంచవే ప్రభూ। ॥నాగ॥

14. జాగిలమందు, గోవులను, ఛాందసునందు జదాత్మనందునన్
భోగినియందు పత్నులను బూచులయందును, వేల్పులందునన్
సాగిననొక్కతీరుగ నిజంబగు తాత్వికువాత నారియన్ ॥నాగ॥

15. చాగురె। సత్వమోహహో। తవ శక్తియటంచును, చారణావళుల్
బాగు। మహత్వమున్. భళి। ప్రభావమటంచు మునీంద్రసంఘముల్
నీగుణ మెన్నప్రస్తుతికి, నేరగజాల నసుద్ధరింపవే। ॥నాగ॥

16. ఓ గురుదేవ। యన్నశివ, ఓరి। యటన్నయశోద తల్లియున్
ఓ గుణరూప। యన్న ఋషు లోరియటన్నను చేదిపాలుడున్
శ్రీగతినిచ్చినావు కదు, చిత్రములెప్పుడు నీ ప్రవర్తనల్ ॥నాగ॥

17. ఆగురుయుద్ధమందు నరునంజికభీవలనన్ జయంబుకై,
బోగునమాన్పి బాణమును బూనగజేయువె యోముకుంద। నా
కాగతి మార్గదర్శివయి యామకొనంగదె మోహబద్ధుడన్ ॥నాగ॥

... గా ధా త్రిం శి క ...

18. ఆగనికోపమంది నృపుడంపు విషంబును భక్తిమీర, నా
వేగములేక "మీర" కడు వేడుక ద్రావినదాని నీవు. వే
వేగభరింపలేదె, నిను వేడెడు వారికి నాశముండునే ॥నాగ॥

19. ఆగని యాకటంబడిన యధ్వగుడై జని యాసుశీలనున్
వేగిరపెట్టి చల్దితిని వేడకయే సుఖమిచ్చినావు. నీ
యాగడమే యనుగ్రహమయా। నెరనమ్మిన భక్తకోటికిన్ ॥నాగ॥

20. ఆ గజరాజు పాహి యనినంతట నక్రముబాధమాన్పగా
వేగమెలక్ష్మిదేవికిని వెళ్ళుట జెప్పకయేగవే దయా
సాగర । నన్యదైవములు జాలరు నీవలె భక్తరక్షకున్ ॥నాగ॥

21. ఆగమమాశ్రయింప సుఖమందును పక్షులుగాని, యానగం
బూగుచు తల్లక్రిందులగుచుండినచో నెటులింతగానకే ।
ఆగహనంపుమ్రాను విడనప్పుడుశాంతికి మార్గముండునే । ॥నాగ॥

22. ఆగమవేద్య । నీకరుణ నందినవారి మహాత్వమేమనన్
బాగుగదున్న చేనయిన ప్రామినుకుల్ పఠియింపజేతురా.
భాగవతార్యులన్ కులము వర్ణముజూచిగణించుటొప్పునే ॥నాగ॥

23. ఆగహనంబునందు గుహు డత్తరి గంగనుదాటజేయగా
ఈ గహనంబునందు భవమీదగజేసి యనుగ్రహింపవే ।
బాగెమురీర । నీ వొసగు పణ్యముబండెను పుణ్యరూపమై ॥నాగ॥

24. ఈ గలశక్తియుండి ద్రుపదేశుడు వెక్కసమాడె ద్రోణునిన్
రాగనెనీవు గోరకనె. రైదనియించితి వా కుచేలునిన్
భోగులు త్యాగులీగతిని బొత్తురు నీ భుజయందునెప్పుడున్ ॥నాగ॥

25. ఏగతి నామదేవు కరుణించి నివేదన మారగించితి
వాగతి నా నివేదనములారడిబెట్టక యాలకింపవే.
నాగభయాపహార । సురనాయక । కేశవ । లోకరక్షకా । ॥నాగ॥

26 ఏగతిరామదాసు ఋణమిచ్చితివప్పుడు తానిషాకు, నిం
కేగతి దామజీఋణము, నిచ్చితి ; భక్తులు నీకునిత్తురే
లాగున ; నీవు నిచ్చుటకు, ంక్ష్యము జూపగనెంచినావొకో ॥నాగ॥

27. ఏగతి సక్కుబాయి కరుణించితి వత్తయు నాడుబిడ్డయున్
రాగతనంబుచేత కడు బాయిడిబెటగ జూడలేక న
న్నాగతి నేలుకొమ్మయల, నాండిబెట్టెడికామమోహముల్ ॥నాగ॥

28. ఓగిరమిచ్చినట్టి ఋషియోషల కక్షయలాభమిచ్చినా
వోగిరమేడ ; నీవిడు డివాకనమేడ ; యనుగ్రహింపవే ;
నాగుణమెన్నబోక భవనాశక ; నీ గుణముల్ తలంచెదన్ ॥నాగ॥

29. కాగలదే తలంపయిన కారణమవ్వలి జన్మకా, తుకా
యోగి సహస్రకోటినుతు లొప్పగ బాడదలంచి, మధ్యలో
సాగక నామదేవుడయి జన్మమునందదె మళ్ళిధాత్రిపై ॥నాగ॥

30. డేగయు పావురంబు శిబి డెందమునారయవెళ్ళినట్లు, నీ
వేగతి నేవిరూపమున నెప్పుడు భక్తువి పరీక్షసేయుగా
నేగెవొ నాడునిన్ను గ్రహియించెడువారలె విజ్ఞులీభువిన్ ॥నాగ॥

31. తూగుచుభక్తితో సుతునిద్రొక్కిన కుమ్మరి మట్టితోడ, ను
ద్వేగుడు గోంకుంభరుడు, వేడకయే సుతుప్రాణమిచ్చి, యా
భాగవతార్య వంశమును పాలనజేయవె కీడడంచియున్ ॥నాగ॥

32. తూగితివీవు రుక్మిణికి తోడనె సత్యవశుండవైతి, వీ
వేగతినిన్నుజూడవలె నెంచగవిస్మయమంచు కొందరున్
ఊగెదరట్లునట్లు తగవో ; నగవో ; గననీవిచిత్రముల్ ॥నాగ॥

33. తూగుదువీవు భక్తిగలదో ! తులసీదళమైన, లేనిచో
ఆగుదువే నగంబిడిన నైనను రుక్మిణి సత్యభామలున్
బాగుగదేల్చినారు నిను బట్టి నిజంబు జగంబునందునన్ ॥నాగ॥

34. నీగుడిమెట్టి సేవయననేరనిసేవ యొనర్చినంతనే
ఈగయు, కాకి, పాము, ఊక మింపగునంచవి శుద్ధజన్మముల్
తాగనె పొనపుండు, తవదాసుడుగా నికనేమిగాంచునో ॥నాగ॥

35. నీగుడిముందు జచ్చుటను నీగణమందొకడై జెలంగె, తా
నాగమవాస పల్లుబులు నచ్చపునామము నేతిబీరగా
సాగ చరించి యానిగమ శర్మ, నినున్భజియింప లోపమే ॥నాగ॥

36. నీగుణవర్ణనంబు గన నేర్తునె తెల్లనొ, పచ్చనోయికన్
జేగురొ, చామనో ! ఋషులు చిత్రముగా యుగమొక్కరీతిగా
భాగవతంబు నాదురని పల్కుచునుందురు, మాటిమాటికిన్ ॥నాగ॥

37. బాగుగనిన్నెరుంగుటకు బ్రాహ్మణజన్మమెగాదు యర్హమో
యాగమవేద్య, రైక్వుడును, వ్యాధుడు నెవ్వరు నట్టివారెవో
నాగను బ్రాహ్మణోత్తములు నారదముఖ్యులు నంతియేగదా ॥నాగ॥

38. బాగుగనిమ్మదిన్గొలచు భక్తునకెప్పుడు నీవుదాసుడై
ఏగుదు వేకనాథునకు, నేగితివంటలవాడవై మరిన్
యేగి నృసింహ మేధు కరుణించితివాదృతి భక్తభూషణా ॥నాగ॥

39. బాగుగనున్న పార్థుని వైరులుజంపెడుచో తటస్థివై
చాగతిలోపరీక్షితుడు జన్మమునంద సజీవుజేసినా
వేగతి యీ సమన్వయము నెల్లెరుగందగు నీదులీలలన్ ॥నాగ॥

40. భోగముబట్టి కర్మలను బొల్పగవచ్చునె ధర్మజుండు వై
భోగముమీర యాగమును బూనినయప్పుడు నకు ప్రస్తు, న
భ్యాగతుభోజనంబునకు పాటిగ ముంగిఫలంబునందెనే ॥నాగ॥

41. మాగినభక్తియో పగయొ మానక నిన్నుదలంచజాలు, సు
శ్రీగనవచ్చు భీష్మగతి చేదిపురీశునిరీతి, లేనిచో
కాగతిజెందువేనువలె గాంచగ రెంటికి జెడ్డరేవడై ॥నాగ॥

42 మూగలు వేదవక్తలయి మూఢులుసైతము కాళిదాసులై
రాగలు శాంతచిత్తులయి రాగులు'గోసయి' గారలై యికన్
భోగులు వేమనార్యులయి వాల్తురు నీదయసోకినంతటన్ నాగ॥

43. రాగిలిగోపికల్దనయ రాసవిహారము పేర మెల్పునన్
ఆగమతత్వముదెలిపి యాశలుమాన్పిప్రపంచవాసనల్
లోగొనకుండజేసిన, విలోలుడ నన్దయజూడవేప్రభూ ॥నాగ॥

44. తాగనుభక్తజేసి పలు రాయిడిగోవగునాసుశీల, కే
లాగలిగించినావు, నపరాధియెజూడగకొన్నివేళలన్
శ్రీగుణనీవు భక్తులను జేయుపరీక్షలు చిత్రముల్ప్రభూ ॥నాగ॥

45. రేగియు ధార్తరాష్ట్రులు పరీక్షకుజిక్కియు దిక్కుదోపకన్
హాగతినీవెయంచు ద్రుపదాత్మజ నిన్ను సభన్దలంపగా
నాగవిమర్ధనా! యపుడు నారినిచీరలొసంగిగావవే! ॥నాగ॥

46. లాగముపీడి యెంగిలిఫలంబులు మంగళమౌఫలంబుతో
దూగెను చూడగా శబరితో సరియెవ్వరు నీదు ప్రేమకున్
నాగరికాళి, కానన జనంబులటంచు విభేదముండునే ॥నాగ॥

47. సాగి నరుండకార్యముల సల్పపురాణము విప్ప నా నరుం
దాగనలేడు వాపివలె దాలిన యూర్వసివంకజూచెనే
ఆ గురిలేనియప్పుడిక, నౌనెపురాణములన్ దలంపగన్ ॥నాగ॥

48. ఆగమజాలమే జగతి కాదరువౌగద వేదహీనమై
ఏగతిసాగులోకమని యెంచిహరించిన రాక్షసాధమున్
వేగమె మీనమై దునిమి వేదములెల్లను బ్రహ్మకీయవే ॥నాగ॥

49. శ్రీగను యత్నమున్ బుధలు సేయగ విఘ్నములావహిల్లినన్
బోగుననుద్ధరించుటకు బూని ధులీంద్రుడవై ముదంబుతో
ఆగిరి వీపునన్నిలిపి హర్షముగూర్పవె దేవతాళికిన్ ॥నాగ॥

50. ఆగడమైనకార్యమున కాకౌని భూమిని ముంచిమించియున్
వీగినరాక్షసాధముని వీకుటయేలని సూకరంబవై
ఈగి రసాతలంబున వధించి వసుంధరనుద్ధరింపవే ॥నాగ॥

51. వీగుచు భక్తుడైన సుతు వేయివిధంబుల బాధపెట్ట, నా
లాగుచరించు రాక్షసకులంబునకున్ గుణపాతమీయ, ను
ద్వేగముతోడ కంబమున వెల్వడవే నరసింహమూర్తివై ॥నాగ॥

52. సాగుచునున్నదంచు బలి స్వర్గము సైతము నాక్రమింపగా
సేగినిజెందిదేవతలు జేయునదేమియులేక వేడగన్
ఓ గరుడధ్వజా! బలిని నొప్పుగ వామనుడై యణంపవే! ॥నాగ॥

53. ఆగడమైన రాజకుల మాపదబుట్టునటంచెరెంగి, యా
తాగలద్రుంపగా పరశురాజముబూని వధించినెత్తుటన్
దోగవె భార్గవుండవయి దోచినయప్పుడు తోయజేక్షణా ॥నాగ॥

54. భోగుల కేకపత్నివ్రతమున్ గరపన్ రఘురామమూర్తివై
యాగముగాచి రాతికి నహల్యకు శాపము బాపి జానకిన్
రాగముమీర పెండ్లియయి, రావణు ద్రుంపవె పృథ్వికోసమై॥నాగ॥

55. బాగుగ తొల్లి తమ్ముడగు బ్రహ్మన కిచ్చిన బ్రహ్మవిద్య పెం
పొగి నసుద్ధరింప భరతావని కౌరవయుద్ధమందునన్
శ్రీగల విశ్వరూపము కిరీటికి జూపవె కృష్ణమూర్తివై ॥నాగ॥

56. యాగము హింసపూరితమునై పశుఘోషణ మిన్నుముట్టగా
త్యాగమె యాగమంచు పరతత్త్వము దెల్పగ బుద్ధమూర్తివై
నైగమమార్గమున్ దిరిగి నాటెముగా నొనరింపవే ప్రభూ! ॥నాగ॥

57. నాగరిక ప్రపంచమున నాథుని పెక్కులునై ప్రభుత్వముల్
బాగునుదప్పి మ్లేచ్ఛతతి పాలనచే నిల తల్లడిల్లె నీ
వేగినినెక్కి భీనుడుప వేగమరాగదె కల్కిరూపమై ॥నాగ॥

... లౌ కి క పె ం చా శి క ...

58 ఆగదు కాలమేరికాట కాపయి తామనుకొన్నరీతిగా
సాగదు ఏదిగాని కొనసాగును కాగలరీతివెంట నీ
వేగద సర్వమున్నడుప యించుక నీదయ జిల్కరింపవే ॥నాగ॥

59. ఆగమరూప భక్తిగలయంతట నంతట నుండకుందువే
ఆగురి లేకయున్న భవదాలయమందున నైతముందువే,
ఏగతిజూడ నిన్నుగన నెక్కటిభక్తియె కారణంబగున్ ॥నాగ॥

60. ఈగలు పూతిగంధమున కేగు నిరంతర మట్లుగాక, జుం
టీగలు పూలతేనియల కేగును లోకమునందు నట్లుగా
ఓగులు యోగు లీజగతి నుందురు తీరొకకైన వేరుగా ॥నాగ॥

61. ఏగతి మచ్చు తిండిపయి కేగును నిమ్మళమందు బోనులో
నీగిన మూషికంబు తననెంజిలి నెంచినయట్లు దేహియున్
భోగవిదూరుడై మెలగ బొందగవచ్చును నిమ్మముక్తుడై ॥నాగ॥

62. ఏగిర దాటినప్పటికి నెప్పుడు నీగిర దాటలేను, న
న్నాగము గాకయుండ దయనారయవే నరుడన్ స్వధర్మమం
దేగతి గానలేక, దరినెక్కుట గానగలేక కుందితిన్ ॥నాగ॥

63. ఓగితమైన భక్తులిడు నొక్కొక చాగిలి నొక్కతాపగా
బాగుగ మోక్షమార్గమున బారులుదీరును కల్లగాదు రా
నీ గనలేరు మూఢులిది నిన్నుదలంపరు మోహబద్ధులై ॥నాగ॥

64. కాగిననీరు కాగున తుకాతుక ద్రెళ్ళెడురీతి కామముల్
వేగుచు ద్రెళ్ళుచున్న తగపెంచియు, పాడిదలంచి ధీరుడై
ఆగముగాక యాగునెడ నాతడుపో నిజమౌ మనుష్యుడున్ ॥నాగ॥

65. జోగని జోలెగట్టుకొని సొక్కుచు నిల్లిలు సంచరించుచున్
యోగులమంచు జెప్పుకొనుచుండెడు వారి కదేడముక్తి, తా
మే గనలేరుగాని తమకెందుకు శిష్యులు భక్తకూటముల్ ॥నాగ॥

66. తీగకు పందిలిన్ మరియు తీగియబోగికి సందిలిన్ సదా
రోగికి మందులున్ మనసురోగికి సందులు, రోవెలండికిన్
భోగులపొందులున్ వలయుపో నవలంబముగా జగంబునన్ ॥నాగ॥

67. దాగుడుమూత లాడుదువు తత్త్వము దోచియు దోచనీక మా
యాగుణ మాశ్రయించి, జగమందున నీ తెరదీసి నన్ను నీ
లోగిలి బంటుగా గొనవె బ్రోవవె జన్మభయంబు దీర్పవే। ॥నాగ॥

68. దోగుట మానినప్పటికి దోగను నింతకు గంగయందు బా
గోగు లెఱింగినప్పటికి ఓగులె బాగులెరుంగలేరు, నీ
వే గురువంచు జేరితిని, నెంజిలి బాపి యనుగ్రహింపవే ॥నాగ॥

69. నాగతి నర్వమీవె యని నమ్ముటయో యటుగాక నేనెపో
నాగతియంచు నిల్చుటయొ న్యాయముగాకను రెండుదారులం
దేగిన నెట్లు మోక్షపద మెవ్వరి కందత దెంతనేర్చినన్ ॥నాగ॥

70. నాగము మంత్రబద్ధమగు నాడును కోరలుగీరలున్న భూ
నాగముగాక నాగమగునా యటు కాలము దప్పినప్పుడున్
తాగన నెంతవాడయిన తప్పును దర్పము గీష్పతిత్వమున్ ॥నాగ॥

71. నీ గుడి జొచ్చువేళ మది నిశ్చలమూనక యున్న మానవుం
డేగిననేమి యచ్చటికి నేగకనేమి చలించు దివ్వెలో
నేగిన చీకటింట గననెంచిన వస్తువు గాంచగల్గునే ॥నాగ॥

72. నీ గుణగానకీర్తనము నేర్పున జేసెడి మానవాళికిన్
యోగములేల యాగముల యోజనలేల వృథాప్రయాసలే
యోగద। గంగలో నిలిచినప్పుడు దప్పికి బావియేలనో ॥నాగ॥

73. పోగులు సోగులెప్పుడును పుట్టము లంతగ ముఖ్యమా ధరన్
నీ గరిమంబు యట్లొరులు నిక్కము హారములట్లు ధీయుతుల్
ఈ గుణతారతమ్యముల నెంచి భజియింతురు దేవతాదులన్॥నాగ॥

74. బాగెము గాదు కానుకిడు పట్టున భక్తియెగాక ముఖ్య మా
బాగెమె యైన లక్ష్మియెదపై నివసించిన నీకు నెంత, యా
భాగము, లోకులిచ్చు ధనమాత్రము నల్పముగాదె చూడగన్ ॥నాగ॥

75. ఓగముపేసి దాచినను పెద్దగ పెత్తన మాచరించినన్
పోగలకాలమున్ దరియ భోగములెవ్వియు నిల్వజాలునే
భోగికి కూసము న్విడిచిపోవుట క్రొత్తలె। యేరెరుంగరే ॥నాగ॥

76. భూ గగనంబులందు పరిపూర్ణుడవై వెలుగొందు నిన్నహో
తా గనలేడు మూర్ఖుడు. మదస్థితు డంధుడు జూడజాలునే
వాగులువాకలై వెలుగు బండిన పున్నమినిండువెన్నెలన్ ॥నాగ॥

77. భూ గుణమాశ్రయించి ఫలభూజము వర్ధిలునట్లు కర్మ ము
ద్యోగుని చిత్తశుద్ధిపయి నొప్పి ఫలించు నిదింతెఱుంగకే
బాగునుదప్పువేళ తమప్రాప్తము దైవము దూరుచుందురో ॥నాగ॥

78. భోగము బూని పన్నగత బొంది భుజంగత దాల్చి చక్రియై
వేగము వక్రవర్తనము జేర్చి సదా నిల సేవనంబుకై
యేగుచు భోగి, భోగిగతి నెప్పుడు నీ భువిలో వసించెదున్ ॥నాగ॥

79. భోగములందు మున్గి నిను పూజయొనర్పని జన్మమేల ఆ
భోగము భోగమే విషయపూరిత భోగముగాక, దుఃఖపుం
భోగముగాక, ఘోరఫణి భోగముగాక ప్రపంచమందునన్ ॥నాగ॥

80. ఛాగమువోలె కామమున సాగుచు దైవమురోసి మానవుల్
వేగుచునుంద్రుగాని నిను వేడగజాలరు నొక్కనాడు, నీ
వేగద యెంచిచూడ పరుదెవ్వడు గల్గును ముక్తినీయగా ॥నాగ॥

81. మాగిన భక్తి యొక్కటియె మార్గము నిగ్గన నీ యుగంబునన్
భాగవతంబునందు నిది పల్కె పరాశరసూనుడైన యా
యాగమవేత్త తానెఱిగినంతకు లోకహితంబు గోరియున్ ॥నాగ॥

82. మాగినమీద పండు తొడిమన్ విడిపోవక యుండనట్లుగా
యేగతి గాచినన్ తనువదేల తిరంబగు నెల్లకాల మీ
లాగు నెఱంగెఱింగియును లక్ష్యము సేయరు లక్ష్యసిద్ధికై ॥నాగ॥

83. యోగవిఘుండవీవు పశుయోనుల బుట్టినవాడ నేను, శ్రే
యోగతి దాతవీవు శుభయోజనలేని యెఱుంగ నేను, న
న్నేగతి గాచెదో। కినుక నేచెదో। భారము నీయదే ప్రభూ। ॥నాగ॥

84. రాగమునున్న కంటి కనురాగము గప్పిన నీజగంబునన్
యోగము గానుపించునె వియోగముగాక దలంచు కాంతసం
యోగముగాక పొందగ ప్రయోగముగాక మఱెంతవారికిన్ ॥నాగ॥

85. రాగము నున్నయప్పు డనురాగము జూపిన బంధుజాలమే
రోగము గొన్నవేళ నవరోధము బల్కి తృణీకరింతురో
రాగము రోగమే సుమి విరాగపు మార్గము లోకమందునన్ ॥నాగ॥

86. రాగము మూడువన్నియల రంజిలుచున్ హరిణీప్రియంబునై
కాగుణమై నఖంబులును కాంతులు కోరలు గీరలొప్పుచున్
దాగును మెత్తనైన పులి తానయి హృద్గుహయందు నెప్పుడున్ ॥నాగ॥

87. రాగిలి చెక్కుచెక్కునకు రాసినయప్పుడు రాజయోగమై
సాగి నఖక్షతంబులను సల్పిన తారకయోగమార్గమై
భోగుల యోగసాధనము పొల్తి సుఖంబులయం దిటుల్ జనున్ ॥నాగ॥

88. రాగిలి రాత్రియున్ పగలు రాతిరిగా సుఖసుప్తి నందుచున్
యోగ మహర్నిశంబు పవలున్నటు సాధన మాచరింపుచున్
రాగులు యోగు లీగతి ధరన్ తమకాలము బుత్తు రెప్పుడున్ ॥నాగ॥

89. రేగిన యింద్రియంబుల పురే యని వంప తపింప నింపుగా
రేగుల కానకేగి యటు రేపునుమాపు వసింపలేను నీ
వేగతి యంచు జేరితి రహిన్ తిరమున్ సమకూర్పవే ప్రభూ॥నాగ॥

90. రేగుల కాన కాపురము లేక శ్రమంబిట లేవు సౌఖ్యముల్
గోగులపంట భోగములు గోముగ బండిన నెందు పిమ్మటన్
రాగులచేను పున్నెములు రంపిలు నొక్కొక దంటుగంటయై॥నాగ॥

91. రోగపుపుట్ట యీతనువు రూపముజూచి భ్రమించనేల పై
భోగము శాశ్వతంబనుచు పొంగగనేల యశాశ్వతంబు దే
వా గతి నీవెయంచు శరణాగతి జెందితి నాదరింపవే। ॥నాగ॥

92. లాగలు తొమ్మిదిన్ గలిగి లాగొక లాగునలేని పుట్ట యీ
భోగశరీర మిందుపొలుపొందు గుణంబులు నాగుబాము లే
లాగున దీని నమ్మనగు లక్షణధామము జూడకుండగన్ ॥నాగ॥

93. లోగినవాని జూడగను లోకము వెక్కసమాడు కీవిలో
దూగినవాని జూడగను త్రోవవొలంగును వీనికెప్పుడున్
యోగులు తామతీతులయి యుందురు నుండనియట్టు లీధరన్॥నాగ॥

94. లోగిలినుండు భోగములలోన నహర్నిశమున్ మునుంగుచున్
కౌగిలిలోననుండు వలకాంతల మోహములందు దేలుచున్
శ్రీగళ నాళలందు నిను చింతయొనర్పరు మూఢమానవుల్॥నాగ॥

95. వాగుడుకాయలెప్పుడును పత్త్రసుగా నిను వాడుకొంచు తా
మేగతి సంచరించినను. నేమనిపల్కుచు రిట్టిభక్తులే
మూగిరి నేడమాయకుల ముంచగ మించుగ పుట్టియున్కగా ॥నాగ॥

96. వాగులు వేలుణొచ్చినను వారిధి మేరలు మీరనట్లుగా
భోగములెన్ని బొందినను పొంగక యెల్లపు డేకరీతిగా
సాగినవాడు యోగి గనజాలు నతండొకడే గదా నినున్ ॥నాగ॥

97. వాగురలందు మచ్చు గని వ్రాలెడు పక్షుల తీపిపాకమం
దీగలరీతి లోభముల కింపుగ జిక్కుచు నుందురీప్రజల్
శ్రీగుణ నిన్నుజేరుటకు జేయరు యత్నము మందబుద్ధులై ॥నాగ॥

98. వాగెనువీడు వారువము బారెడురీతిగ నింద్రియాశ్వముల్
వేగముచేత దుర్విషయ వీథులు బారుచునుండె వాని నే
నేగతి నొంతు నిన్నెటుల నెంతు కనుంగవ నెట్లు గాంతునో ॥నాగ॥

99. వేగమ గుర్తుబట్టు నెటు వేషము వేసినగాని యేలికన్
దాగన జాగిలంబటుల దా గనలేడు నరుండు చిత్రమౌ
భూగగనంబులందు చెలువొందెడు రూపములెల్ల నీవెగా ॥నాగ॥

100 త్రేగు సహింపజాల నెటు వేగగజాల ప్రపంచమందు నే
వేగు ఔరుంగలేను చెలువేగును యేగును నాయురర్థముల్
వేగరివీవ దీనిగన వేగమునన్ గరుణింపవే ప్రభూ। ॥నాగ॥

101. శ్రీగన బుద్ధికిన్ భుజము చిత్తుకు సత్తును కర్మకున్ మనీ
షాగతి తోడుగావలయు చాలవు నొక్కొకటిన్ సమర్థమై
యేగతి బండి రెండుజతయెద్దులు లేకయెసాగు చక్కగా ॥నాగ॥

102. సాగక కార్యముల్ ప్రజ నిశాసమయంబున వేగినంతనే
జాగొనరింప నల్పతర జన్మములందున నిన్నుగొల్వగా
సాగునె శ్రేష్ఠమైన నరజన్మము నందియు నిన్నుగొల్వరో। ॥నాగ॥

103. సాగరతీరమందు దిసుకంచాత్పున దీర్చుకొలంది కోరికల్
మూగుచునుండుగాని తుదముట్టగలే వొకనాటికైన ఈ
భోగములింకజాలు నినుదొందెడి మార్గము జూపవేకృపన్। ॥నాగ॥

104. సాగిననాడు యేండ్లు కొనసాగిననాడును చిత్తుచిత్తుగా
త్రాగిననాడు మంచికిని డాగిననాడు విశేషసౌఖ్యముల్
మూగిననాడు మానవుడు ముక్తినిధానము గాంచజాలునే। ॥నాగ॥

105. సాగిలి మ్రొక్కినాను భవసాగర మీదగలేను దీనితో
వేగగలేను యాత్రలకు వెళ్ళగలే నెటువంటి పున్నెముల్
నేగనలేను నీవెగతి నేరములెన్నక బ్రోవవేదయన్। ॥నాగ॥

106. సాగొనరించువేళ తను జాగొనరింప ఫలంబు నిష్ఫలం
బౌగతి నిన్ను గొల్చుటకు యౌవనసంపద దాటినంతటన్
యేగతి బుద్ధికిన్ తిరము నేర్పడు పారమునొంద తోడ్పడున్॥ ॥నాగ॥

107. సోగ కనుంగవన్ సొలసి జూచిన ప్రేయసి తాగరంగడే
యేగతి రక్తుడౌనతడు నెప్పుడు నీ గుణగానముల్వినన్
ఆగతినా గరంగ దెవడాతని భక్తుడనంగ జెల్లునే। ॥నాగ॥

ఫలశ్రుతి

108. లేగ నరుండుగాగ శృతిలీలల బిండిన నీవలెన్ కృతిన్
దాగను నల్పశబ్దముల ధాత్రి మహార్థములాగి శ్రోతలన్
బాగనుపించు బోధకుల భవ్య దయామతి బ్రోవవే ప్రభూ ॥నాగ॥

KABA103B147

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KABA103B147
పుస్తకం పేరు	పండరినాథవిఠలశతకము
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	43
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	i, ii, B, xvi ,bci
లేని పేజీలు	
తయారు చేసినది	Sowmya
పేజీలు విడదీసినది	Sowmya
స్కాన్ చేసినది	Sumitha
పరీక్ష చేసినది	prathyusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good